ప్రజాశక్తి
గురువారం 20 నవంబరు, 2025
5
శ్రీకాకుళం

ఎన్‌కౌంటర్‌లో జోగారావు మృతి

బాతుపురంలో విషాదఛాయలు

జోగారావు (ఫైల్)

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో పోలీసుల కాల్పుల్లో బుధవారం ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. అందులో మావోయిస్టు పార్టీలో కీలక నేత, వజ్రపుకొత్తూరు మండలం బాతుపురానికి చెందిన మెట్టూరు జోగారావు అలియాస్ టెక్ శంకర్ (56) ఉన్నారు. జోగారావు 1988లో అప్పటి పీపుల్స్‌వార్ ఉద్యమానికి ఆకర్షితుడై ఉద్యమంలో చేరాడు. మావోయిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలకు కీలక నేతగా ఎదిగారు. గత రెండు రోజులుగా అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి సమీపంలో జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో తప్పించుకున్న ఆయన, బుధవారం పోలీసుల కాల్పుల్లో మృతి చెందాడు. మృతుల్లో మెట్టూరు జోగారావు అలియాస్ టెక్ శంకర్ ఉన్నట్లు అల్లూరి జిల్లా ఎస్‌పి అమిత్ బర్దార్ ప్రకటించడంతో జోగారావు స్వగ్రామం బాతుపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మెట్టూరు కామయ్య, చిన్నపిల్ల దంపతుల ఆరుగురు సంతానంలో జోగారావు మూడోవాడు. తండ్రి కామయ్య చాలా ఏళ్ల కిందటే మృతి చెందగా, తల్లి రెండు నెలలు కిందట మృతి చెందింది. పదో తరగతి వరకు చదువుకున్న జోగారావు గ్రామంలో చురుగ్గా ఉండేవాడు. తర్వాత పీపుల్స్‌వార్ సిద్ధాంతాలు నచ్చి 1988లో ఉద్యమంలోకి వెళ్లిపోయారు. అప్పట్నుంచి ఇప్పటివరకు జోగారావు ఇంటికి రాలేదని గ్రామస్తులతో పాటు బంధువులు చెప్తున్నారు. జోగారావుపై పదేళ్ల కిందటే ప్రభుత్వం రూ.20 లక్షల రివార్డు ప్రకటించింది. జోగారావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు పోలీసులు ప్రకటించినా, ఆ సమాచారం కుటుంబసభ్యులకు ఇంతవరకు అధికారికంగా అందలేదని బంధువులు చెప్పారు. మరోవైపు పలు ప్రజాసంఘాల నాయకులు, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ ప్రతినిధులు జోగారావు ఇంటికి చేరుకుని తమ సంతాపం ప్రకటించారు.

'కార్గో'తో ఉద్దానాన్ని విధ్వంసం చేస్తారా..?

రేపట్నుంచి ప్రభావిత గ్రామాల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన

వార్త మెయిన్‌లో...

కూచిపూడి నృత్య ప్రదర్శన

ఈ ఒక్క రోజే..!

- నేటితో పుస్తక మహోత్సవం ముగింపు
- పెరుగుతున్న సందర్శకుల తాకిడి

పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు

నేటి కార్యక్రమాలు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢ నమ్మకాలు - శాస్త్రీయ దృక్పథం అంశంపై విద్యార్థులకు అవగాహన, ప్రయోగాలు. 'కళింగాంధ్ర యాస భాష'పై చర్చాగోష్ఠి. అనంతరం ఎకోస్ అండ్ ఎంబర్స్, డౌన్ డౌన్ డార్విన్ అట పుస్తకావిష్కరణలు, కరవాక పుస్తక పరిచయం. జోష్ శివ శిష్య బృందం సినీ నృత్యాలు, డప్పు వాయిద్యం, గాయత్రి స్వరాంజలి ఆర్కెస్ట్రా సినీ గీతాలు.

'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ, మంచి పుస్తకం కొనుక్కో'.
- కందుకూరి వీరేశలింగం

'నేను చనిపోతే నా చుట్టూ పుస్తకాలు పెట్టండి'
- సుధామూర్తి

ప్రజాశక్తి - అరసవల్లి

ఒక మంచి పుస్తకం వంద మంది స్నేహితులతో సమానం. పుస్తకాలు చదవడమంటే జ్ఞానానికి మెరుగు పెట్టినట్టే. అటువంటి పుస్తకాలకు శ్రీకాకుళం నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవం వేదికగా నిలుస్తోంది. చిన్న పిల్లల పుస్తకాల నుంచి అన్ని వర్గాలకు చెందిన పుస్తకాలకు నిలయంగా మారింది. వంద పబ్లిషర్ల, లక్ష పుస్తకాలతో పుస్తకాభిమానులను కనువిందు చేస్తోంది. ఈనెల 11వ తేదీన ప్రారంభమైన పుస్తక మహోత్సవానికి అనూహ్య స్పందన లభిస్తోంది. రోజురోజుకూ సందర్శకుల తాకిడి పెరుగుతోంది. పుస్తక ప్రదర్శన ఒక్కటే కాదు... పలు సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద, పాశ్చాత్య నృత్యాలు, పుస్తకావిష్కరణలు, కవితా పఠనం, చర్చాగోష్ఠితో ఉత్సాహభరితంగా సాగుతోంది. ఇదే కాదండోయ్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇంకా పుస్తక మహోత్సవాన్ని సందర్శించని వారెవరైనా ఉంటే గురువారమే ఆఖరి రోజు. ఇంకెందుకు ఆలస్యం..! పుస్తక పండగను చూసి మీకు నచ్చిన పుస్తకాలను కొనేయండి.

కాళీపట్నం రామారావు సాహిత్య వేదికపై 'జాతీయోద్యమంలో కళింగాంధ్ర' అంశంపై బుధవారం చర్చాగోష్ఠి నిర్వహించారు. సిక్కోలు పుస్తక మహోత్సవ కమిటీ కె.శ్రీనివాసు మాట్లాడుతూ కళింగాంధ్రలో గిరిజన, రైతాంగ పోరాటాలు సాగాయన్నారు. గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావు, గరిమెళ్ల వంటి వారు తమ రచనలతో పోరాటం చేశారని, ప్రజల్లో చైతన్యం తెచ్చారని తెలిపారు. రచయిత చౌదరి తారకేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజనులు దోపిడీకి గురైనప్పుడు అల్లూరి సీతారామరాజు పోరాటం చేశారని తెలిపారు. రచయిత కె.జనార్ధనరావు మాట్లాడుతూ కళింగాంధ్రులు పోరాట పటిమతో స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. గరిమెళ్ల పాటలు స్వాతంత్ర్య ఉద్యమంలో చైతన్యం తెచ్చాయన్నారు.

రచయిత, గాయకులు మండా శ్రీనివాసరావు రచించిన కళా పూర్ణోదయంలో లయతరంగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కుత్తుం వినోద్ రచించిన 'స్వాతంత్రోద్యమంలో సిక్కోలు వీరులు' పుస్తకావిష్కరణ అనంతరం రచయిత లోపింటి జితేంద్రరెడ్డి పరిచయం చేశారు. అరుణ్ బవేరా రచించిన 'ఇలాంటి ఓ ప్రయాణం' పుస్తకాన్ని రచయిత పి.ఎస్ శ్రీనివాస్ పరిచయం చేశారు. అనంతరం కవితా పఠనం నిర్వహించారు.

ముళ్లపూడి రామచంద్రరావు ఆధ్వర్యాన సత్య హరిశ్చంద్ర కాటి సీను పౌరాణిక నాటికను అద్భుతంగా ప్రదర్శించారు. నీరజా సుబ్రమణ్యం శిష్య బృందం కూచిపూడి నృత్యాలు ఎంతగానో అలరించింది. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన గురుత్వాకర్షణ శక్తి ప్రయోగం విద్యార్థులను ఆకట్టుకుంది.

గురుత్వాకర్షణ శక్తి ప్రయోగం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

సత్యహరిశ్చంద్ర కాటి సీను ప్రదర్శన

పెట్రోల్ బంకులో మోసం

బంకును పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని చాపర రాధాకృష్ణన్ పెట్రోల్ బంకులో డీజిల్ కొలతలపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. జలకలింగుపురానికి చెందిన నడిమింటి ఉమాపతి 40 లీటర్ల కేన్‌లో రూ.4,000కు డీజిల్ కొట్టించాడు. కేను నిండకపోవడంతో విషయం బయటపడింది. బంకు యజమానిని ప్రశ్నిస్తే అదేం లేదు అంటూ దురుసుగా ప్రవర్తించి కొల పాత్రతో కొలిచాడు. కేవలం 35 లీటర్లు మాత్రమే ఉండడంతో వెంటనే బంకు యజమాని రసీదులను చించేశాడు. బంకు సిస్టం మొత్తం ఆఫ్ చేశాడు. గ్రామస్తులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న తహశీల్దార్ బడే పాపారావు, ఎస్ఐ పి.రమేష్‌కుమార్, డిటి కె.రాము, ఆర్ఐ పి.ఆశ, విఆర్ఒ మల్లేశ్వరరావు బంకు వద్దకు చేరుకుని యజమానిని ప్రశ్నించారు. ఆయన నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. పలు వాహనదారులూ మైలేజ్ తగ్గిపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే తూనికలు, కొలతలు అసిస్టెంట్ కన్సల్టెంట్ చిన్నప్పుడు, జిల్లా తూనికలు, కొలతలుశాఖ సేల్స్ ఆఫీసర్ రాజీవ్ వచ్చి బంకును పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇంకా బంకులో కనీస సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు లేవని ప్రజలు పేర్కొన్నారు. దాడుల్లో రెవెన్యూశాఖ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'పోసా' చట్టం పకడ్బందీగా అమలు

- లైంగిక వేధింపుల నిరోధం అందరి బాధ్యత
- చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ తదితరులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోసా యాక్టు - 2013) పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. లైంగిక వేధింపులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆచరించే విధానంపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన నగరంలోని బి.ఆర్ అంబేద్కర్ కళా వేదికలో బుధవారం నిర్వహించిన వర్క్‌షాపు, అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళలు పని ప్రాంతాల్లో లైంగిక వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. సంఘటిత రంగాల్లోనే ఈ వేధింపులు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. మహిళా కమిషన్‌కు లైంగిక వేధింపులు, గృహ హింసకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. కార్యాలయాలు, సంస్థల్లో వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు స్థానిక కమిటీలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు మహిళలు ముందుకు రావడానికి చట్టాలపై అవగాహన అవసరమన్నారు. 2013లో వచ్చిన లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై ఉద్యోగులకూ సరైన అవగాహన లేదన్నారు. అందరూ బాధ్యత తీసుకొని లైంగిక వేధింపులను అరికట్టడానికి సహకరించాలని కోరారు. లైంగిక వేధింపులపై ఫిర్యాదులకు స్థానిక కమిటీలు లేకపోవడంతో విద్యార్థులు కమిషన్ వద్దకు రావాల్సి వస్తోందన్నారు. చట్టాలపై మహిళలకు అవగాహన ఉన్నప్పుడే లైంగిక వేధింపులు తగ్గుతాయన్నారు. ఎక్కువ మంది మహిళలు పనిచేసే చోట స్థానిక ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటయ్యే విధంగా కలెక్టర్‌తో మాట్లాడతానన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళలకు సురక్షితమైన ప్రాంతంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్ రజిని, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ దినేష్ కుమార్, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నారీమణి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (భీమునిపట్నం) ప్రిన్సిపాల్ పెంకి సురేఖ, లోకల్ కంప్లైంట్ కమిటీ సభ్యురాలు లక్ష్మీకుమారి, మహిళా కమిషన్ సలహాదారులు రావూరి సూయిజ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఐ.విమల, బెజ్జిపురం మనోవికాస కేంద్రం అధ్యక్షులు ప్రసాదరావు అంబేద్కర్ యూనివర్సిటీ సోషల్ వర్కు అసిస్టెంట్ ప్రొఫెసర్ యు.కావ్యజ్యోత్స్న పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లా చోడవరం మండలం బుచ్చయ్యపేటలో భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తూ తల్లీబిడ్డల బలవన్మరణానికి కారణమైన పోరెడ్డి ఉమామహేశ్వరరావుకు బెయిల్ మంజూరు చేయకుండా కఠినంగా శిక్షించాలని ఐద్వా నగర కార్యదర్శి టి.ప్రవీణ, నగర కమిటీ సభ్యులు మధురగుంట లక్ష్మి వినతిపత్రం అందజేశారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్

నమూనా చెక్కును అందజేస్తున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి - నరసన్నపేట, టెక్కలి రూరల్

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. నరసన్నపేట మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించిన రైతు సంబర సభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశానికి రైతే వెన్నెముక అని అన్నారు. అధిక శాతం మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, అందుకే రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేశామని చెప్పారు. గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, కేవలం రూ.ఏడు వేలు మాత్రమే రైతుభరోసా కింద ఇచ్చిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఒక్కో రైతు ఖాతాలో కేంద్రం వాటా రూ.రెండు వేలు, రాష్ట్ర వాటా రూ.ఐదు వేలు చొప్పున మొత్తం రూ.ఏడు వేలు జమ చేసినట్లు తెలిపారు. తొలి విడత 46,85,838 మంది రైతులకు రూ.3,175 కోట్ల మేర రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. రెండో విడతగా 46,85,838 రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో రూ.3,135 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రైతులకు రూ.24.71 కోట్ల నమూనా చెక్కును కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త బగ్గు అర్చన, కార్పొరేషన్ ఛైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, పిఎసిఎస్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

టెక్కలి పట్టణంలోని ఒక కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన రైతు సంబర సభ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడారు. రైతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. అనంతరం రైతులకు రూ.28.47 కోట్ల చెక్కును రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, వ్యవసాయశాఖ అధికారులు, టిడిపి నాయకులు బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, పినకాన అజయ్ కుమార్, ఎల్.ఎల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

ఖైదీలతో మాట్లాడుతున్న హరిబాబు

ప్రజాశక్తి - గార

ముద్దాయిలు తమ శిక్షాకాలంలో సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు సూచించారు. మండలంలోని అంపోలులో గల జిల్లా కారాగారాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీల కేసు వివరాలను అడిగి తెలుసుకుని, న్యాయపరంగా తగు సూచనలు చేశారు. ఖైదీలకు అందిస్తున్న ఆరోగ్య సంరక్షణ, ఆహారం, పరిశుభ్రత వంటి కనీస సౌకర్యాలపై ప్రత్యేక దృష్టిసారించారు. ఆహార సంబంధిత అధికారులతో కలిసి ఖైదీలకు అందిస్తున్న ఆహార సామగ్రి నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడుతూ శిక్షను పూర్తి చేసుకుని, విడుదలైన తర్వాత సమాజంలో కూడా మంచి గుర్తింపు వచ్చేలా జీవించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కారాగారం జైలర్ దివాకర్ నాయుడు, జైలు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మనుగడ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మొక్కలతోనే మానవ మనుగడని జిల్లా అటవీశాఖ అధికారి జగదీశ్వరరావు అన్నారు. మండలంలోని నైర ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థుల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం మండలంలోని చల్లవానిపేటలో బుధవారం ఐదో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల భావితరాలకు స్వచ్ఛమైన గాలి అందుతుందని అన్నారు అందుచేత ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్క అయినా తాము ఉండే ప్రదేశాల్లో నాటాలని సూచించారు. రోడ్డుకిరువైపులా, స్కూల్ ఆవరణల్లో, పబ్లిక్ ప్రదేశాల్లో మొక్కలు నాటాలన్నారు. తొలుత ఎన్ఎస్ఎస్ పాతక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు డాక్టర్ గురుమూర్తి, డాక్టర్ లక్ష్మీదుర్గ, డాక్టర్ హేమంత్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

నేల ఆరోగ్యం, భూసార పరీక్షకు మట్టి నమోన సేకరణ పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. నైర కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ పి.గురుమూర్తి నేల ఆరోగ్యం ప్రముఖాన్ని తెలిపి రైతులు తమ పంట భూములు ఆరోగ్యంగా ఉంచే సూచనలు వివరించారు. నేలకు తగినంత సేంద్రీయ ఎరువు వేసి, పంట మార్పిడి పాటించాలన్నారు. పంటల వ్యర్థాలు నేలలో కలపాలన్నారు. ఎరువులు అవసరం మేర మాత్రమే వాడాలన్నారు. రెండేళ్లకోసారి భూసార పరీక్ష చేయించాలన్నారు. భూసార పరీక్షకు మట్టి నమోనని సరైన పద్ధతిలో సేకరించాలని తెలియజేశారు.

మొక్కను నాటుతున్న జగదీశ్వరరావు

కాస్మోపాలిటన్ క్లబ్‌కి పూర్వ వైభవం తెస్తాం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శిథిలావస్థలో ఉన్న క్లబ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అరసవల్లి

సుదీర్ఘ చరిత్ర కలిగిన నగరంలోని కాస్మోపాలిటన్ క్లబ్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేసి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని జిల్లా కలెక్టర్, క్లబ్ ఛైర్మన్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి బుధవారం మారుతి థియేటర్ ఎదురుగా ఉన్న క్లబ్‌ను సందర్శించారు. క్లబ్ నిర్వహణ సరిగా లేక శిథిలావస్థకు చేరుకుందని కార్యదర్శి సురంగి మోహనరావు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పుండ్కర్, క్లబ్‌కు ఆర్థిక స్వయం సమృద్ధిని కల్పించే దిశగా కీలక ప్రణాళికను సూచించారు. ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న క్లబ్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించడం ద్వారా నెలవారీ అద్దె ఆదాయంతో క్లబ్‌ను సర్వాంగ సుందరంగా, ఆధునికంగా తీర్చిదిద్దవచ్చని చెప్పారు. క్లబ్ అభివృద్ధికి సంబంధించిన తగిన ప్రతిపాదనలతో క్లబ్ సభ్యులంతా మరోసారి తనను కలవాలని కలెక్టర్ సూచించారు. గతంలో ఎంతోమంది ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు బ్యాడ్మింటన్, టెన్నిస్ వంటి క్రీడల కోసం ఈ క్లబ్‌కే వచ్చేవారని ఎమ్మెల్యే గొండు శంకర్ గుర్తుచేశారు. జిల్లా కేంద్రంలోని గెజిటెడ్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు క్లబ్‌ను మరింత మెరుగుపరచడానికి ప్రభుత్వం తరుపున తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.

వామ్మో... ఆధార్!

- ప్రకటనకే పరిమితం
- విద్యార్థులకు తప్పని పాట్లు

ప్రజాశక్తి- టెక్కలి

పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన ఆధార్ నమోదుల్లో తలెత్తిన లోటుపాట్లు సవరణ తలనొప్పి వ్యవహారంగా మారుతుంది. చాలా మంది విద్యార్థులకు చెందిన ఆధార్ నమోదులో తప్పులు దొర్లాయి.వాటిని సవరించే క్రమంలో కేంద్రాల వద్ద తల్లిదండ్రులు, విద్యార్థులు పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పదో తరగతి పరీక్షల ఫీజులు చెల్లింపు కోసం ప్రభుత్వం షెడ్యూల్ జారీ చేసే క్రమంలో ఆధార్‌కార్డు నమోదు తప్పనిసరైంది. అయితే విద్యార్థుల ఆధార్‌లు సక్రమంగా ఉన్నా వారి తల్లిదండ్రులు పేర్లు నమోదులో ఏర్పడిన లోపం వల్ల ఫీజులు చెల్లింపునకు ఆటంకంగా మారింది. ఆధార్‌లో దొర్లిన తప్పులు సవరణకు పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇటువంటి లోపాన్ని గుర్తించిన జిల్లా యంత్రాంగం ప్రతి మండల కేంద్రంలో ఐదు ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మాటిచ్చారు. అయితే ఒక్కరోజు మాత్రమే కేంద్రం నిర్వహణ చేపట్టారు. తుపాను సందర్భంగా వరుసగా మూడు రోజులు విద్యాలయాలకు సెలవులు ప్రకటించడంతో మూసిన కేంద్రాలు మరి తెరువలేదు. కొన్ని మండలాల్లో కేంద్రం నిర్వహణకు సంబంధిత మండలస్థాయి అధికారులు ముందుకు రాకపోవడం గమనార్హం. విద్యార్థులకు చెందిన ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీలు, పేర్లు సవరణ, తల్లిదండ్రులు పేర్లు నమోదులో తప్పులు వంటి లోపాలు ఉన్నాయి. వాటి సవరణలో జాప్యం ఏర్పడుతుండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కాగా, టెక్కలిలో తంతితపాలా కార్యాలయంలో ఆధార్ కార్డులు సవరణలు చేస్తుండడంతో అక్కడ అక్కడ రద్దీ ఏర్పడుతుంది. పట్టణంలో మరికొన్ని చోట్ల ఆధార్ కార్డు మార్పులకు కేంద్రాలు ఉన్నా ఆవి సర్వర్ డౌన్ వల్ల సక్రమంగా పనిచేయకపోవడంతో తంతితపాలా కార్యాలయం వద్ద గిరాకీ ఏర్పడుతుంది. దీనిపై సంబందిత జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ, పొందూరు

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు శ్రీకాకుళం నగరంలోని నెహ్రూ యువ కేంద్రంలో ఈనెల 21న ఉదయం పది గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో చిక్కోల్ సోలార్ ఎనర్జీ సర్వీసెస్ (సేల్స్ ఎగ్జిక్యూటివ్ - 30), శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ (సేల్స్ మేనేజర్ - 20) కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగానికి ఏదైనా డిగ్రీ అర్హత ఉండగా, సేల్స్ మేనేజర్ ఉద్యోగానికి పదో తరగతి నుంచి డిగ్రీ, డిప్లొమా వరకు అర్హత అని స్పష్టం చేశారు. ఎంపికైన పురుష అభ్యర్థులకు నెలకు రూ.15 వేలు నుంచి రూ.25 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ విద్యార్హతలు, ఉద్యోగ అనుభవ వివరాలను ముందుగా WWW.NCS.GOV.IN వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికేట్లు, ఆధార్ కార్డు తీసుకొని రావాలని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

24న పొందూరులో...

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఈనెల 24న పొందూరులో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పొందూరులోని సిస్టమ్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాలో అరబిందో, కాన్సెంట్రిక్స్, టాటా ఎలక్ట్రానిక్స్, కియా మోటార్స్ సహా సుమారు 16 ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు పాల్గొని 650 ఖాళీలను భర్తీ చేయనున్నాయని తెలిపారు. ఎస్ఎస్‌సి నుంచి డిగ్రీ వరకు చదివి, 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉన్న నిరుద్యోగ యువత అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి శ్రీకాకుళం, విశాఖపట్నం, శ్రీసిటీ, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రిఫరెన్స్ నంబరుతో పాటు రెజ్యూమ్, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో సహ జాబ్‌మేళా వేదిక వద్దకు చేరుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7569077449, 9550967353 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

జగన్‌తో జిల్లా నాయకులు

జగన్‌ను కలిసిన జిల్లా నాయకులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ కలిశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ సమీక్ష సందర్భంగా జగన్‌ను కలిసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర వైసిపి కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా వైసిపి పార్లమెంట్ పరిశీలకులు కుంభా రవిబాబు, జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ కలిశారు. జిల్లాలో వైసిపి బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించామని విజయ తెలిపారు.

కాంగ్రెస్ ఆశయాలే పునాది

విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి- టెక్కలి

పేదల ఆశా జ్యోతిగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ ఆశయాలే అభివృద్ధికి పునాదులని డిసిసి మాజీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వర రావు అన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుక బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోడ్ల కూడలి వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. బ్యాంకుల జాతీయకరణ వంటి ఎన్నో ఉపయోగకరమైన విధానాలను కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిందని అన్నారు. దేశాన్ని రక్షించే బాధ్యత ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధుసూదనరావు, సీనియర్ నాయకులు పొట్నూరు ఆనందరావు, టి.బి.జె.గుప్త, డాక్టర్ చింతాడ బాలకృష్ణ, దాట్ల లింగరాజు, కోటకశంకరరావు, పేడాద సూర్యనారాయణ పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

జర్నలిస్టులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

సమాజహితం కోరుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచే జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వ్యక్తిగత అంశాల కన్నా సామాజిక చైతన్యానికి జర్నలిజం దోహదపడాలని ఆయన అభిప్రాయ పడ్డారు. జాప్ జిల్లా అధ్యక్షుడు జి.షణ్ముఖరావు అధ్యక్షతన నగరంలో స్థానిక సన్‌రైజ్ హోటల్‌లో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 33వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకు మారుతున్న ప్రస్తుత తరుణంలో జర్నలిస్టులు కూడా వాటిని అందిపుచ్చుకుని చక్కని ప్రజాహితంతో కూడిన వార్తలను అందించాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే సహకారం పూర్తిస్థాయిలో అమలు జరిగేలా తనవంతు కూడా కృషి చేస్తానని తెలిపారు. 33ఏళ్లుగా జర్నలిస్టుల సంక్షేమం, ఐక్యత కోసం జాప్ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, అఖిలభారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, ఎపి విద్య, మౌళిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ పిఎంజె బాబు, ఎపి మార్క్‌ఫెడ్ స్టేట్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, టిడిపి నగర అధ్యక్షుడు పాంద్రంకి శంకర్, ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ సభ్యులు కొంక్యాన వేణుగోపాల్, మీడియా జెఎసి కన్వీనర్ జోగినాయుడు పాల్గొన్నారు.

రైతులకు ఆర్థిక తోడ్పాటే లక్ష్యం

మెళియాపుట్టి : నమూనా చెక్కును అందజేస్తున్న జెసి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కంచిలి

రైతులు సాంప్రదాయ సాగు పద్ధతుల నుంచి సాంకేతికత వైపు దృష్టి సారించాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక కంచిలి మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో బుధవారం నిర్వహించిన రైతు సంబర సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమది రైతు ప్రభుత్వమని, రైతును అన్ని దశల్లో ఆర్థికంగా తోడ్పాటు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రైతులకు అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ కింద ఏటా రూ.20 వేలు అందిస్తున్నామని అన్నారు. డ్వామా పీడీ సుధాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా లబ్ధిదారునికి అందడం మంచి పరిణామం అన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, వ్యవసాయశాఖ ఎడి టి.భవానీశంకర్, కూటమి నాయకులు మాదిన రామారావు, టి.వి.రమణ, పూర్ణచంద్ర బిసాయి, రమేష్ రెడ్డి, వి.రవి, ఎం.పూర్ణ, ఎం.ఎం.పట్నాయక్, కిషోర్ చంద్ర పాడి, పైల సూర్య నారాయణ రెడ్డి, పిలక చిన్నబాబు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మెళియాపుట్టిలో నిర్వహించిన రైతు సంబరాల సభలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు రైతు సుఖీభవ-పిఎం కిసాన్ నమూనా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సలాం మోహనరావు, పాతపట్నం ఎఎంసి చైర్మన్ భైరిసింగి దినకర్ పాల్గొన్నారు.

మందస : మండలంలోని భోగాపురంలో అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ రెండో విడత పథకం నమూనా చెక్కును ఎమ్మెల్యే గౌతు శిరీష అందజేశారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని ఆర్ఎస్‌కె ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ వెంకటేష్, రాష్ట్ర డైరెక్టర్లు తాతారావు, రమణ, దుర్యోధన, రుద్రయ్య, కొర్ల కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: అన్నదాతలకు ఎల్లవేళలా సిఎం చంద్రబాబు నాయుడు అండగా ఉంటారని డిసిసిబి చైర్మన్ శివ్వాల

బూర్జ : నమూనా చెక్కును అందజేస్తున్న డిసిసిబి చైర్మన్ తదితరులు

కంచిలి : నమూనా చెక్కును అందజేస్తున్న విప్ అశోక్

సూర్యనారాయణ అన్నారు. మండలంలోని పెద్దపేట రైతు విత్తనాభివృద్ధి క్షేత్రంలో అన్నదాత సుఖీభవ రెండవ విడత విడుదల చేస్తున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, ఎఎంసి చైర్మన్ శ్రీరాములనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది శ్రీరాములు నాయుడు, మాధురి, ఎఒ డి.ఉషారాణి, తహశీల్దార్ వై.వి.పద్మావతి, ఎంపిడిఒ తిరుపతిరావు, నీటి సంఘ అధ్యక్షులు కడగల కృష్ణ, డి.బాలకృష్ణ, మండల బిసిసెల్ అధ్యక్షులు మామిడి దుర్గారావుతో పాటు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న అర్హులైన 33 వేల మంది రైతులకు రెండవ విడత అన్నదాత సుఖీభవ డబ్బులు జమ చేయడం జరిగిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ కార్యాలయం ప్రకటన విడుదల చేశారు. సిఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు ఇచ్చిన హామీ రెండవ విడత రూ.7 వేలు కూడా జమ చేసిందన్నారు.

స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

ఆమదాలవలస: డిగ్రీలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ఎన్ స్వామి తెలిపారు. బుధవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిఎ (పొలిటికల్ సైన్స్), బిఎ హిస్టరీ, బికాం (కంప్యూటర్స్) కోర్సుల్లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. అడ్మిషన్లు కోసం ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు 95152 25991, 950550447, 63011 83553 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

గోవిందరావుకు పిహెచ్‌డి

ప్రజాశక్తి- పొందూరు

మండలం పెనుబర్తి గ్రామానికి చెందిన తమ్మినైన గోవిందరావు చేసిన పరిశోధనలకు విశాఖపట్నం గీతం యూనివర్శిటీ పిహెచ్‌డి పట్టాను ప్రధానం చేసింది. ఈయన '5జి మొబైల్ అప్లికేషన్ల కోసం ఎలక్ట్రోమాగ్నెటిక్ బ్యాండ్ గ్యాప్ (ఇబిజి) నిర్మాణాన్ని ఉపయోగించి ఫోర్-పోర్ట్ మిమో యాంటెన్నా యొక్క పనితీరు లక్షణాలపై పరిశోధనల'కు గాను ఈయనకు పిహెచ్‌డి ప్రధానం చేశారు. డాక్టర్ మణికొండ రమేష్ పర్యవేక్షణలో గోవిందరావు ఈ పరిశోధనలను చేశారు. ప్రస్తుతం ఈయన విజయనగరంలోని ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. పిహెచ్‌డి సాధించడంపై గ్రామస్తులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి- రణస్థలం

ప్రతిఒక్క పౌరుడు సంబంధిత సచివాలయంలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో యాడ్ అయి ఉండడం, సిటిజన్ ఇకెవైసి తప్పనిసరని ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ప్రతిఒక్క పౌరుడు గ్రామ, వార్డు సచివాలయం ద్వారా సేవలు అందుకోవడానికి వారు నివాసముంటున్న సంబంధిత సచివాలయంలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు వ్వాలన్నారు. 2019 నుంచి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో యాడ్ అయి ఇప్పటివరకు ఆథరైజేషన్ ఇవ్వనివారు కచ్చితంగా సిటిజెన్ ఇకెవైసి చేసుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ద్వారా అందించే పథకాలు యొక్క లబ్ది డిబిటి ప్రాసెస్ ద్వారా జరుగుతుందని, దీనికి ఇకెవైసి చేసుకున్న లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆధార్ లింక్ బ్యాంక్ అకౌంట్ నందు లబ్ధి చేకూరేందుకు ఇకెవైసి చాలా ముఖ్యమని, దీనిని గమనించి ప్రజలందరూ ఇకెవైసి కంప్లీట్ చేసుకోవాలని కోరారు.

ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి

పలాస: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలంటూ పంచాయతీ కార్యాలయాలకు వెళ్లే ప్రజలకు సరైన జవాబుదారీ ఇవ్వకుండా అధికారులు పనిచేస్తున్నారా? కనీసం ఏ పనులపై వచ్చారని అడిగే నాథుడు కరువయ్యాడని, పనులపై వచ్చేవారికి దురుసుగా ప్రవర్తిస్తున్నారని వైస్ ఎంపిపి తలగాన శ్రీరాములు ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉంగ ప్రవీణ అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ముందుగా మండల ఇంజినీరింగ్ విభాగ అంశంపై చర్చలో పంచాయతీ అధికారి నర్సింహమూర్తిని ప్రశ్నిస్తూ... పనులపై కార్యాలయానికి వచ్చినప్పుడు సరైన రీతిలో సమాధానం చెప్పాలన్నారు. మండల సమావేశాలకు పంచాయతీ కార్యదర్శులకు సంబంధించి దిగువస్థాయి అధికారులు మాత్రమే హాజరవుతుండడం సరికాదన్నారు. వ్యవసాయశాఖ అంశంపై ఎఒ పోలారావును చినంచల ఎంపిటిసి దుర్యోధనరావు ఇకెవైసిపి అంశంపై ప్రశ్నించారు. ఈ ఏడాది మండలంలో 12,613 ఎకరాలకు చెందిన వివిధ భూముల రైతుల పేర్లు ఈ-క్రాప్ నమోదు చేశామని, డేటా ప్రకారం వారి పేర్లను నమోదు చేశామని తెలిపారు. మండలంలో 13 సచివాలయ కేంద్రాలను పాడి ప్రొక్యూర్మెంట్‌కు ఎంపిక చేశామని అన్నారు. అక్కడి రైతు సేవా కేంద్రాల ద్వారా ఆయా పంచాయతీల్లో

మాట్లాడుతున్న వైస్ ఎంపిపి శ్రీరాములు

వివరాలను రైతులు నమోదు చేసుకుంటే ధాన్యం బస్తాలను వివిధ మిల్లులకు తరలించవచ్చునన్నారు. ఇరిగేషన్‌శాఖ అంశంపై జెఇ శ్రీనివాసరావు మాట్లాడుతూ లొత్తూరు వరహాలగెడ్డను సుందరీకరించేందుకు రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు చేపట్టేందుకు ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. అనంతరం హౌసింగ్, వెలుగు, ఐసిడిఎస్, ఉపాధి హామీ, విద్య, విద్యుత్ అంశాలపై చర్చించారు. సమావేశానికి ఆర్‌డబ్ల్యుఎస్, అటవీశాఖ అధికారులు గైర్హాజరయ్యారు. హాజరుకాలేదు. సమావేశంలో ఎంపిడిఒ ఎన్.వసంతకుమార్, తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి, పిఎసిఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, ఉప మండలాభివృద్ధి అధికారి మెట్ట వైకుంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం చేస్తున్న తోటి విద్యార్థులు

వెల్లివిరుస్తున్న మానవత్వం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడిన రమేష్ కుటుంబం ఎదుర్కొంటున్న విషాద పరిస్థితులపై 'ప్రజాశక్తి' ఇటీవల ప్రచురించిన 'మావయ్య నాన్నేరి?' కథనం గ్రామీణ ప్రాంతంలో మనసున్న వారి హృదయాలను కదిలిస్తోంది. భార్య, ముగ్గురు చిన్నారులు, వృద్ధ తల్లితో దిక్కుతోచని స్థితిలో ఉన్న రమేష్ కుటుంబానికి సహాయం అందించేందుకు పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. బుధవారం ఉదయం వివిధ సంవత్సరాల్లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు, పరిసర ప్రాంతాల గ్రామస్థులు తమ వంతు సాయం అందజేశారు. 2004లో రమేష్ భార్య మోహినితో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.66,666 నగదు, రూ.5,000 విలువైన నిత్యావసర సరుకులు అందించారు. 2011-12 బ్యాచ్ విద్యార్థులు రూ.4,100 ఆర్థికసాయం అందించారు. రమేష్ కుటుంబ పరిస్థితి తెలుసుకున్న సమీప గ్రామం రామయ్యపుట్టుగ గ్రామస్తులు తమ వంతుగా రూ.23,500 అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొని మానవత్వం ఇంకా బతికి ఉందని చాటిచెప్పారు.

మెరుగైన పునరావాసం కల్పిస్తాం

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని నువ్వులరేవు ఉప్పుటేరు వంతెన నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు మెరుగైన పునరావాసం కల్పిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక సర్పంచ్ మువ్వల పూర్ణచంద్ర అధ్యక్షతన నిర్వాసిత ప్రాంతంలో నిర్మిస్తున్న ఇళ్లను బుధవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో కలిసి నిర్వాసితులతో మాట్లాడారు. తన తండ్రి మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ హయాంలో సుమారు రూ.30 కోట్ల వ్యయంతో నువ్వులరేవు ఉప్పుటేరు బ్రిడ్జి నిర్మాణం చేపట్టారన్నారు. అయితే నువ్వులరేవు నుంచి మంచినీళ్లపేట వరకు వంతెన రోడ్డు పూర్తయిందని తెలిపారు. కొన్ని కారణాల వల్ల నువ్వులరేవు వైపు వంతెన పనులు నిలిచిపోయిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పని చేసిన మంత్రి కనీసం ఈ వంతెన వైపుకన్నెత్తి కూడా చూడక పోవడంతో పనులు ముందుకు సాగలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం

ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీష

వచ్చిన తర్వాత అసంపూర్తిగా మిగిలిన పనులు చేపట్టడానికి ప్రత్యేక నిధులు కేటాయించామని తెలిపారు. వచ్చే ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, మెరుగైన పరిహారం అందిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్‌డిఒ వెంకటేష్, ఎంపిటిసి నీలాంబరు, పిఎసిఎస్ అధ్యక్షులు కణితి సురేష్ చౌదరి, మాజీ అధ్యక్షులు దువ్వాడ హేమబాబు చౌదరి, మాజీ ఎంపిపి గొరకల వసంతస్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కృష్ణచైతన్యను విమర్శించే హక్కు లేదు

ప్రజాశక్తి- నరసన్నపేట

పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్యను విమర్శించే హక్కు టిడిపి నాయకులు బగ్గు అర్చనకు లేదని వైసిపి నాయకులు మండిపడ్డారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం వైసిపి యువజన విభాగం నాయకులు విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో బగ్గు అర్చన రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తూ... అధికారిక కార్యక్రమాల్లో హడావుడి చేస్తున్నారని అన్నారు. కృష్ణచైతన్య పోలాకి జెడ్‌పిటిసి గెలుపొందారని గుర్తు చేశారు. దమ్ముంటే ప్రజా క్షేత్రంలో గెలిచి విమర్శలు చేయాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దండి జయప్రకాష్, మండల యూత్ అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, రెంటికోట త్రినాథరావు, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి కనపల అరవింద్, మండల సోషల్ మీడియా అధ్యక్షులు కుప్పిలి రాంకుమార్, మండల యూత్ ఉప అధ్యక్షులు తోట భార్గవ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ చిన్నంనాయుడు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 20.70 కేజీల గంజాయిని పట్టుకున్నామని సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఒడిశా రాష్ట్రం మోహన బ్లాక్ బాపూజీ నగర్ వీధికి చెందిన అమిలైసా పాణి గంజాయిని కొనుగోలు చేసి ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు వస్తున్నారని అన్నారు. సమీపంలోని మట్టి రోడ్డు వద్ద టౌన్ ఎస్ఐ ముకుందరావు తనిఖీ చేయగా... గంగంజాయి పట్టుబడిందన్నారు. ఒడిశాలోని కొను గోలు చేసి గంజాయి వ్యాపారం చేసే బీరజ్ ఎలియాస్ దరమ్ బీర్ నాయక్‌తో కలిసి ముంబాయిల్లో అమ్మేందుకు వెళ్తున్నట్టు వెల్లడించారు. ఆయనను అరెస్టు చేసి సెల్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

పెద్దబాణాపురం మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- నందిగాం

దీనబంధు నాయుడు (ఫైల్)

మండలంలోని పెద్ద బాణాపురం మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు, వంశధార డిస్ట్రిబ్యూటరీ వజ్రపుకొత్తూరు కమిటీ మాజీ అధ్యక్షులు, మాజీ సైనికులు పైల దీనబంధునాయుడు మంగళవారం రాత్రి మృతి చెందారు. సౌమ్యుడిగా, నిబద్ధత గల మనిషిగా, నిక్కచ్చిగా వ్యవహరించే రాజకీయ నాయకుడిగా అందరి మన్ననలు పొందారు. ఆకస్మికంగా మృతి చెందడంతో టిడిపి నాయకులు పినకాన అజయ్ కుమార్, వంశధార ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మళ్ల బాలకృష్ణ, మాజీ సైనికోద్యోగులు, ప్రజలు నివాళ్లర్పించారు.

ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మందస మండలం బేతాళపురానికి చెందిన బత్తిని లక్ష్మీనారాయణపై వజ్రపుకొత్తూరు మండల టిడిపి నాయకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. లక్ష్మీనారాయణ రాజకీయ లబ్ధికోసం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రేరేపిస్తూ... కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రశాంతంగా ఉండే గ్రామాల్లో విద్వేషాలు పెంచి, అశాంతి సృష్టించే విధంగా ప్రసంగాలు చేస్తూ... ప్రభుత్వానికి, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అసత్య ఆరోపణలు సామాజిక మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గోవింద పాపారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ హేమబాబుచౌదరి, పి.సాంబ మూర్తి, అంబటి రామకృష్ణ, ఆకుల పాపారావు, పల్లెటి బాలు, కదంబాల వెంకటరమణ, వంక రామారావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేస్తున్న సభ్యులు

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- పొందూరు

పట్టణంలో శ్రీ సత్యసాయి బాబా శతవర్ష జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. అలాగే దత్తత గ్రామమైన వాండ్రంగిలో నిరుపేదలకు 25 అమృత కలశాలు, 25 దుప్పట్లును పంపిణీ చేశారు. అనంతరం కేక్‌కట్ చేసి జయంతి ఉత్సవాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.లక్ష్మి, సత్యసాయి సేవాసమితి కన్వీనర్ దున్నా రాధాకృష్ణా, ఇఒ మోహన్‌బాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో చంద్రబాబు పాత్ర ఎనలేనిది

రణస్థలం: ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధిలో సిఎం నారా చంద్రబాబు నాయుడు పాత్ర ఎనలేనిదని, విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని నవ్యాంధ్ర సొండి కుల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు నెమలిపురి కోటేశ్వర చౌదరి కొనియాడారు. బుధవారం రణస్థలం వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఎంత శ్రమిస్తున్నారో సిఐఐ భాగస్వామ్య సదస్సు నిలిచిందన్నారు. ఈ సదస్సు ద్వారా పెట్టుబడుల యుగానికి పునాది పడటం మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ దృష్టిని మళ్లీ కేంద్రీకరించిందన్నారు. విశాఖలో జరిగిన సిఐఐ సమ్మిట్లో రెండు రోజుల్లోనే భారీ ఎత్తున ఒప్పందాలు కుదుర్చుకొని పెట్టుబడుల వర్షం కురిపించడం చంద్రబాబు, లోకేష్ కి పెట్టుబడుల పట్ల ఉన్న స్పష్టమైన విజన్ను కనిపిస్తుందన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నాట్య ప్రదర్శన

అరసవల్లి: కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా శ్రీవెంకటేశ్వర సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో శ్రీకాంత్ రఘుపాత్రుని 20 మంది శిష్య బృందం మొదటి రోజు శిల్పారామంలో, రెండవ రోజు వాహన సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులకు అమ్మవారి ప్రసాదంతో సత్కరించారు. నృత్య ప్రదర్శనలో శ్రీభాష్యం సుందర రామకౌండిన్య, నేహా, హిమబిందు, చాందిని, సాహిత్య సౌమ్య, శాశ్విత ఐశ్వర్య, శ్రీకళ, లత, కాలఘ్న రామ్, లలిత, జోత్స్న, శ్రీవల్లి, శ్రావణి, నేహాసిరి, భాగ్య హర్షిత, పవిత్ర, సంజన, ఝరి, విజయభాస్కర్ పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న బృందం

బూర్జ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిసిసిబి చైర్మన్ తదితరులు

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో పెద్దపేట విత్తన అభివృద్ధి క్షేత్రంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ ఈ ఏడాది రైతులకు ఆది నుంచి అన్ని కష్టాలుగా ఉన్నాయని, దీనిని ఉద్దేశించి ప్రభుత్వం రైతులకు 100 కేజీల ధాన్యానికి రూ.2,389 మద్దతు ధర ప్రకటించిందని, 17 శాతం తేమ ఉంటే రైతులు నేరుగా కొనుగోలు కేంద్రానికి పండించిన పంట ఇవ్వాలన్నారు. అలాగే వారం రోజుల్లో రైతు ఖాతాలోకి డబ్బులు జమ కానున్నాయన్నారు ప్రతి రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ప్రతి గింజ కూడా ప్రభుత్వం కొనేందుకు కట్టుబడి ఉందన్నారు. దళారులను నమ్మొద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ ఎ.రామకృష్ణ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, డిఆర్‌డిఎ పిడి కిరణ్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ఉషారాణి తహశీల్దార్ వైవి పద్మావతి, ఎంపిడిఒ తిరుపతిరావు, ఎఎంసి చైర్మన్ మజ్జి శ్రీరాములు నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది శ్రీరాములు నాయుడు, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు, నీటి సంఘం అధ్యక్షులు కడగల కృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు బి.సీతారాం బాబు నాయుడు, ఎంపిటిసి పోలినాయుడు, పిఎసిఎస్ ఇన్‌ఛార్జి సిఇఒ సన్యాసిరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : రైతులు ధాన్యం కొనుగోలుపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పిఎసిఎస్ అధ్యక్షులు సిమ్మ మాధవి అన్నారు. సైలాడలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు సంపదరావు మురళి, కొర్లకోట ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, టిడిపి నాయకులు గుజ్జల లక్ష్మణరావు, తోట రాము, టి.అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

కవిటి: బోధన-అభ్యాసన ప్రమాణాలను మెరుగుపర్చే దిశగా టీచ్‌టూల్ సర్టిఫైడ్ అబ్జర్వర్లకు కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన రిఫ్రెష్ శిక్షణ ముగిసింది. ఈ కార్యక్రమానికి డిఆర్‌పిలుగా వ్యవహరించిన ఈశ్వరాచారి, దూదిష్టి రౌళో, సురేష్ కుమార్ పాత్రో ఉపాధ్యాయులకు మార్గదర్శకత్వం వహించారు. మొత్తం 30 మంది పాల్గొన్న ఈ శిక్షణలో సిఆర్‌ఎం నిర్వహణ నుంచి డేటా ఎంట్రీ వరకు అనేక అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. విద్యార్థుల హాజరు, పాఠశాల అభివృద్ధి చర్యలు, అభ్యాస స్థాయుల నమోదుకు టీచ్‌టూల్ యాప్ వినియోగంపై స్పష్టమైన సూచనలు ఇచ్చారు. మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ ముగింపు సందేశం అందిస్తూ క్షేత్రస్థాయిలో గమనించిన అంశాలను మండల అధికారులకు ఎలా నివేదించాలో తెలిపారు.

టెక్కలి : ఉపాధ్యాయులు బోధించే అంశాలను తరగతి గదిలో వినియోగం చెందేలా పర్యవేక్షించాలని ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావులు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన టీచ్ టు టూల్ శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు శిక్షణలు దోహదపడతాయన్నారు. హెచ్‌ఎం డి.దాశరథి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అమ్మనమ్మ, రోణంకి శ్రీనివాసరావు, ఎన్.శోభారాణి, బి.నేతాజీ, ఎంఆర్‌సి సిబ్బంది రవి, రాంబాబు పాల్గొన్నారు.

పొందూరు: విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంఇఒ-1, 2 ఎం.వాగ్దేవి, పి.రాజారావు అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలు, సిఆర్‌ఎంటిఎస్‌కు సర్టిఫైడ్ టీచ్‌టూల్ ట్రైనింగ్ అబ్జర్వర్స్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కోర్స్ డైరెక్టర్‌గా పి.రాజారావు, డిఆర్‌పి లుగా ఎపిఎంఎస్ ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్, టి.మురళీకృష్ణలు వ్యవహరించారు.

ఇచ్ఛాపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో టూల్ శిక్షణా తరగతులను నిర్వహించారు. కోర్సు డైరెక్టర్లు ఎంఇఒ-2ఎస్. విశ్వనాథం, రిసోర్స్ పర్సన్లుగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డి.వైకుంటరావు వ్యవహరించారు. వివిధ పాఠశాలల నుంచి ఎన్నికైన 26 మంది ఉపాధ్యాయులకు, సిఆర్‌ఎంటిలకు రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఉపాధ్యాయుల పాఠ్యాంశ బోధన మందింపుపై అబ్జర్వేషన్‌కు ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఇఒలు కురమాన అప్పారావు, విశ్వనాథం తెలిపారు. మున్సిపల్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం బి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెక్కలి : శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి- బూర్జ

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరికీ బాధ్యతని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లకు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. ప్రభుత్వం గ్రామాల స్వచ్ఛత కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యం సమకూరుందని, వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతన్నారు. అందుకు పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరు కలిసికట్టుగా గ్రామస్తులతో పాటు గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులు ముందుకు రావాలని కోరారు. గ్రామ ప్రజలకు అపరిశుభ్రత కారణంగా ప్రబలే అనర్థాలను అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరు నివాస ప్రాంతాలను తద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో బాధ్యత వహించాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఎంపిడిఒ తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించారు.



జి.సిగడాం రూరల్ : మాట్లాడుతున్న ఎంపిడిఒ

జి.సిగడాం రూరల్ : పచ్చదనం పరిశుభ్రతతో గ్రామాలు విరాజిల్లినప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపిడిఒ జి.రామ కృష్ణారావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులకు క్లీన్ అండ్ గ్రీన్‌పై సమావేశాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కాయల రమణ, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని ఎంపిడిఒ ఎం.పావని అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛభారత్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బి.రామారావు, ఎఒ మోహనరావు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విగ్రహానికి పూలమాల వేస్తున్న విగ్రహదాతలు తదితరులు

పోరాట యోధులు ఝాన్సీ లక్ష్మీబాయి

ప్రజాశక్తి- అరసవల్లి

భారతదేశ తొలి స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించి బ్రిటిష్ వారిని ఝాన్సీ లక్ష్మీబాయి గడగడలాడించారని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల సంఘ సంస్కర్తల స్మృతివనంలో ఝాన్సీ లక్ష్మీబాయి 197వ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహదాతలు సువ్వారి గాంధీతో పాటు జామి భీమశంకర్, నిష్టల నరసింహమూర్తి, బరాటం లక్ష్మణరావు, పైడి హరనాథరావు, నటుకుల మోహన్, చౌదరి రాధాకృష్ణ తదితరులు ఝాన్సీ లక్ష్మీబాయి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో అవధాన పండితులు పైడి హరనాధరావు, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు, జి.నాగేశ్వరరావు, కొమ్ము రమణమూర్తి, సత్యసాయి మధు, పైడి విజయ్, సూర కిరణ్, ఎస్.తవిటిరెడ్డి, ముళ్ల ధర్మారావు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులతో కళాశాల విద్యార్థులు

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

అరసవల్లి: ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రముఖ విద్యావేత్త, కళాశాలల అధినేత డా.జామి భీమశంకర్ అన్నారు. గొంటివీధిలో గల విద్యాధరి డిగ్రీ కళాశాలలో స్వాగత వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రాంగనంలోకి నూతనంగా అడుగుపెట్టిన విద్యార్థులకు స్వాగతమన్నారు. విద్యాబోధనకు ప్రత్యేక స్థానముందని, మన జీవిత భవిష్యత్‌కు బాటలు వేసేది గురువులేనని తెలిపారు. సత్ప్రవర్తనతో తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలని, కళాశాల నిబంధనలను పాటిస్తూ, క్రమశిక్షణతో, ఉన్నతమయిన విద్యాబుద్దులు నేర్చుకుని, జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల మేనేజిమెంట్ వీటి.నాయుడు, భాగ్యలక్ష్మి, ఎంవిజి శంకరరావు, హేమసుందర్, అధ్యాపకులు కూన అనిల్‌కుమార్, అధ్యాపకులు విజయలక్ష్మి, కిరణ్, ఎర్రంనాయుడు, సతీష్, అశోక్, వాసు, రమేష్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొన్న జెడ్‌పిటిసి గోవిందరావు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అన్యాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ అన్యాయమని రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని జెడ్‌పిటిసి బెండి గోవిందరావు అన్నారు. బుధవారం మండలంలోని చింతలపేట, అక్కులపేట, చిట్టివలస, తొగరాం, కలివరం గ్రామాల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ కార్యక్రమంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వలన పేదలు ప్రభుత్వ వైద్యానికి దూరం అవుతారని, అలాగే పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్య దూరమై అందని ద్రాక్షగా మిగులుతుందన్నారు. కార్యక్రమాల్లో మహిళలు, యువత, రైతులు పాల్గొని సంతకాలు చేసి తమ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయికుమార్ పరామర్శ

రణస్థలం: మండలంలోని రణస్థలంలో వైసిపి కార్యకర్త గొర్లె రమణ, శ్రీను తల్లి ఇటీవలే మరణించారు. వారి కుటుంబ సభ్యులను ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి నాయకులు పిన్నింటి సాయికుమార్ బుధవారం పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో రణస్థలం మాజీ సర్పంచ్ పిన్నింటి లక్ష్మునాయుడు, వైసిపి నాయకులు మజ్జి రమేష్, మహంతి జోగినాయుడు, యువ నాయకులు సన్నెన శంకర్, వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ కరిమజ్జి రమణ, గొర్లె కేశవ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న సాయికుమార్

గ్రంథాలయంలో మహిళా దినోత్సవం

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్రపటానికి సర్పంచ్ యు.లక్ష్మీ పూలమాల వేసి నివాళ్లర్పించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పోస్టుమాస్టర్ ఎల్.లక్ష్మిని సర్పంచ్ సాలువతో సన్మానించారు. అనంతరం గ్రంథాలయంలో మహిళలతో ముగ్గుల పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, ఎల్.మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బూర్జ: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా గ్రంథాలయాధికారి కె.సునీత ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. విద్యార్థులచే ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని బొడ్డేపల్లిపేట శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా ముగ్గుల పోటీలు

బూర్జ : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సునీత

నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 45 మంది బాలికలు ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి మున్సిపల్ హైస్కూల్ చింతాడ, ద్వితీయ బహుమతి గవర్నమెంట్ హై స్కూల్, తృతీయ బహుమతి లక్ష్మీ నగర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు దక్కించుకున్నారు. ఈ పోటీలకు పి భవాని, సిహెచ్ సుధారాణి, జి.అనూష న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

మెళియాపుట్టి : స్థానిక శాఖాగ్రంథాలయంలో మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఆర్.అనురాధ పూలమాలలు వేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగవల్లికల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రధానోపాధ్యాయులు మహాలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో జెడ్‌పిహెచ్ హైస్కూల్, కెజిబివి, నలంద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీలిమ, నమిత పాల్గొన్నారు.

నందిగాం: శాఖాగ్రంథాలయం నందిగాంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ పూలమాలలు వేశారు. అనంతరం మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయం అవశ్యకత అంశంపై వకృత్వ పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హేమలత పాల్గొన్నారు.

టెక్కలి : సమాజంలో ఉన్న మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంపిడిఒ ఎం.రేణుక అన్నారు. స్థానిక గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ముగ్గుల పోటీలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి, వి.దేవి, సహాయకులు అమ్మనమ్మ పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక గ్రంథాలయంలో మాజీ పిఎం ఇందిరాగాంధీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి టి.ఇందిర పూలమాలలు వేశారు. అనంతరం బాలికలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు.

వైద్య సేవల్లో లోపాలు సరిదిద్దాలి

ప్రజాశక్తి- కవిటి

విజయవాడలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్‌ను సీడాప్ మాజీ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలను ప్రభావితం చేస్తున్న అత్యవసర వైద్య సమస్యలను వివరించి వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇచ్ఛాపురం పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, చికిత్స కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆస్పత్రిలో చేరిన రోగులకు ఆహారం అందకపోవడం, జనరేటర్ లేనందున అత్యవసర వైద్య సేవలు నిలిచిపోవడం వంటి అంశాలను ప్రత్యేకంగా వివరించారు. ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ చిన్నపాటి పెండింగ్ పనుల వల్ల ఇంకా ప్రారంభం కాకపోవడంతో పూర్తిగా ఆక్సిజన్ సిలిండర్లపై ఆధారపడుతోందని

వినతిపత్రం అందజేస్తున్న శ్యాంప్రసాద్‌రెడ్డి

తెలిపారు. వీటన్నింటినీ అత్యవసరంగా పరిష్కరించాలని ప్రజల తరుపున విజ్ఞప్తి చేశారు.

నాబార్డు నిధులతో రూ.6.55 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బారువ 30 పడకల ఆస్పత్రి చివరి దశలో నిలిచిపోయిందని, ఈ పెండింగ్ పనులను పూర్తిచేసి సముద్రతీర ప్రాంత ప్రజలకు వెంటనే వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ ఆస్పత్రి ప్రారంభం అయితే తీరప్రాంత ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని తెలిపారు.

డయాలసిస్ రోగులకు...

సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం డయాలసిస్ కేంద్రాలు సామర్థ్యాన్ని మించి రోగులను నిర్వహిస్తున్నందున వెయిటింగ్ లిస్ట్ పెరుగుతోందని, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వేలాది మందికి ఇది పెద్ద సమస్యగా మారిందని అన్నారు. బారువలో కొత్త ఆస్పత్రి పూర్తయ్యాక పాత ఆస్పత్రిని డయాలసిస్ కేంద్రంగా మార్చే ప్రతిపాదన ముందే ఉందని అన్నారు. నిర్మాణం నిలిచిపోయిన పనులను వెంటనే పున్నప్రారంభించి వేగవంతం చేయాలని కోరారు.

కవిటి సిహెచ్‌సికి ప్రత్యేక సదుపాయాలు అవసరం

మారుమూల ప్రాంతమైన కవిటిలోని సిహెచ్‌సిలో వైద్యులు చేరేందుకు ఆసక్తి చూపడం లేదని, గిరిజన ప్రాంతాల్లో ఇచ్చే ప్రత్యేక అలవెన్సులను ఇక్కడి వైద్యులకూ ఇవ్వాలని సూచించారు. అలాగే కవిటి డయాలసిస్ కేంద్రంలో నెఫ్రోలాజిస్ట్ నియామకం తక్షణం చేపట్టాలని పేర్కొన్నారు. ఈ వినతులు విన్న అనంతరం కార్యదర్శి సౌరబ్ గౌర్ సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు శ్యాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

అన్న క్యాంటీన్ సేవలు భేష్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళిలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ సేవలు చాలా సంతృప్తికరంగా ఉన్నాయని ఎంపిపి కుప్పిలి ఫణీంద్ర కుమార్ అన్నారు. అన్న క్యాంటీన్‌ను మధ్యాహ్నం భోజనాల సమయంలో బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. భోజనాల నిర్వహణ వంటకాలు చాలా సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. అన్న క్యాంటీన్ పరిసరాల్లో మరిన్ని వసతులు కల్పించేదుకు చర్యలు చేపడతామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రతి పేదవాడూ ఆనందంగా భోజనం చేసేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తామని తెలిపారు.

పనిముట్లు పంపిణీ

ప్రజాశక్తి- టెక్కలి

వివిధ రకాల తరగతులకు చెందిన వారికి కేంద్ర ప్రభుత్వం అందించిన పనిముట్లుని పోస్టుమాస్టర్ మెండ ఉపేంద్ర బుధవారం పంపిణీ చేశారు. పట్టణంలోని రజక, వడ్రంగి, దర్జీ, కుమ్మరి, గోల్డ్‌స్మిత్ తరగతులకు చెందిన వారికి విశ్వకర్మ యోజన పథకం ద్వారా పనిముట్లు సరఫరా చేశామని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త హనుమంతు ఉదయ్‌భాస్కర్, పోస్టల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పనిముట్లను పంపిణీ చేస్తున్న ఉపేంద్ర

భూ హక్కు కల్పించేందుకే 'స్వామిత్వ'

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రతి గ్రామంలోనూ ఎవరి భూమిని, స్థలాన్ని సొంత హక్కులు కల్పించేందుకు స్వామిత్వ పథకాన్ని ప్రభుత్వం అమలు చేసిందని ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్ అన్నారు. మండలంలోని గంగారాంలో 'స్వామిత్వ'పై ఎంపిపి రోణంకి ఉమా అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో సొంత ఇంటి స్థలాలు, నీటి వనరులు ఇతర సొంత ఆస్తులను ఎవరికి వారిగా కేటాయించి భూహక్కు కార్డులను పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం ప్రతి ఒక్కరీ సొంత స్థలాలు, ఇతర వివరాలను సేకరిస్తున్నామని అన్నారు. అందుకోసం ప్రతిఒక్కరూ తమకు, తమ సిబ్బందికి సహకరించాలని కోరారు. భూముల పట్టాలు పత్రాలు వలె ఈ 'స్వామిత్వ' కార్డులు కూడా

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

ఉపయోగపడతాయని అన్నారు. దీనివల్ల నాది, నీది అనే చిన్న చిన్న తగాదాలు ఉండబోవని వివరించారు. అలాగే గ్రామకంఠం పరిధిలో ఇళ్లు, స్థలాలు సర్వే చేసి జారీ చేసిన 9 (2) నోటీసులపై ఫిర్యాదులను స్వీకరించారు. సమ్మతం తెలిపిన ఆస్తి యజమానుల నుంచి సంతకాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి మల్లేశ్వరరావు, సర్పంచ్ పేడాడ జోష్న, టిడిపి నాయకులు వీరఘట్టపు శివరావు, ఎం.ప్రకాశరావు, లండ వసంతరావు, కొర్ర అప్పన్న పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఎఇ అప్పన్న తెలిపారు. కొల్లివలసలో ఉన్న 33 కెవి, 11 కెవి మరమ్మతులు కారణంగా, అలాగే కొత్తగా బ్రేకర్ కనెక్షన్ పెట్టడం జరుగుతుందన్నారు. దీనివలన మండలంలోని కొల్లివలస సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న కొల్లివలస, గుత్తావల్లి, ఉప్పినవలస, నారాయణపురం, కొరగాం, తోటవాడ తదితర గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపల్లి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి, సరియపల్లి, కురుడు, చౌదరికొత్తూరు, దంత, నారాయణపురం, చిన్నసాన, పులిబంద, రామ్మూర్తిపేట, కిడిమి, కిడిమి బుడిది, భద్రాచలం, జమచక్రం, మదనాపురం, జరాలి, సవరపేట, కిడిమిగొల్లపేట, చంద్రయ్యపేట గ్రామాలకు, అలాగే పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

కూరగాయల నారు పెంపకంపై శిక్షణ ముగింపు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన షేడ్‌నెట్ ప్రో ట్రే విధానం ద్వారా కూరగాయల నారు పెంపకంపై నిర్వహించిన మూడురోజుల వృత్తి శిక్షణ బుధవారంతో ముగిసినట్లు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా. కె. భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ శిక్షణలో ఉద్యాన శాస్త్రవేత్త డా. వి.హరికుమార్ పాల్గొని నాణ్యమైన విత్తన రకాల ఎంపిక, చీడపీడల నియంత్రణ, తాజా షేడ్‌నెట్ల ఏర్పాటు విధానాలు వంటి అంశాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. అలాగే ఉద్యానశాఖ అధికారి అయంతి కుమారి ఆముదాలవలస పరిధిలో కొత్త నర్సరీల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ప్రభుత్వ ఉద్యాన నర్సరీల పథకాలు వంటి వివరాలను శిక్షణలో పాల్గొన్న రైతులకు తెలియజేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పలాస, పాతపట్నం, మెళియాపుట్టి, మందస, కొత్తూరు, హిరమండలం ప్రాంతాల నుంచి పలువురు యువ రైతులు పాల్గొని

రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త హరికుమార్

శిక్షణను సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.సునీత, డా.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

బైండోవర్ చేస్తున్న తహశీల్దార్ మురళీమోహన్

పది మందిపై బైండోవర్

ప్రజాశక్తి- కవిటి

మద్యం దుకాణాలు నిబంధనలు పాటించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఇచ్ఛాపురం ప్రోహిబిషన్ ఎక్సైజ్ పరిధిలో పాత కేసుల్లో పట్టుబడిన పది మంది వ్యక్తులను పిలిపించి తహశీల్దార్ మురళీమోహన్ వద్ద బుధవారం బైండోవర్ చేశారు. బైండోవర్ కేసు ఏడాది వరకు అమలులో ఉంటుందని, దీన్ని అతిక్రమిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రజలు నాటుసారా, కల్తీ మద్యం, గంజాయిపై అప్రమత్తంగా ఉండి తమకు తెలిసిన సమాచారాన్ని 14405 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఎన్.కృష్ణారావు, సిబ్బంది కాంతారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాఠశాల వద్ద చంద్రభూషణ్

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి- కవిటి

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించే పలు పాఠశాలలను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ చంద్రభూషణ్ బుధవారం పరిశీలించారు. కవిటి, రాజపురం, బొరివంక, ఆర్.బెలగాం తదితర పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో వసతులు, పరిసర ప్రాంతాలు పరిశీలించారు. ఈ సందర్భంగా బొరివంక పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

దీపక్ శర్మకు వాకర్స్ క్లబ్ అభినందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

దేశ సమైక్యత కోసం.. పర్యావరణ పరిరక్షణ కోసం.. డ్రగ్స్ రహిత సమాజ ఆవిష్కరణ కోసం హర్యానా రాష్ట్రానికి చెందిన దీపక్ శర్మ చేపడుతున్న సైకిల్‌యాత్ర బుధవారం శ్రీకాకుళం నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో దీపక్ శర్మకు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సత్కరించి దేశాభివృద్ధిని కాంక్షిస్తూ దీపక్ శర్మ చేస్తున్న సైకిల్ యాత్ర విజయవంతం కావాలని నడక సంఘం ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, శాసపు జోగినాయుడు, పీజీ గుప్తా, అంకడాల తవిటన్న, గుడ్ల జగ్గారావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దీపక్ శర్మ మాట్లాడుతూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఈ సైకిల్‌యాత్ర చేపడుతున్నానని చెప్పారు. ఇంతవరకు తొమ్మిది రాష్ట్రాల మీదుగా యాత్ర సాగిందన్నారు. కార్యక్రమంలో స్టార్‌వాకర్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాదరావు, నాగేశ్వర ఈశ్వరరావు, పట్నాన శేఖర్, పట్నాన రామారావు, నల్లబాటి కృష్ణమూర్తి, వినీల, జెసి పట్నాయక్, గుడ్ల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బోరు వేసిన సర్పంచ్ దేవమ్మ

పాఠశాలలో బోరు ఏర్పాటు

నందిగాం: మండలంలోని దిమ్మిడిజోల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న బోర్ వెల్ ఇటీవల పాడైంది. దీంతో తాగునీటి కోసం విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. దీంతో సర్పంచ్ సలాన దేవమ్మ పాత బోరు స్థానంలో నూతన బోర్ వెల్, పైప్‌లైన్ వేసి విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించారు. దీంతో విద్యార్థుల ఇబ్బంది తొలగినట్టయ్యింది. కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్‌కుమార్, మాజీ సర్పంచ్ సలాన నాగమ్మ, కృష్ణారావు పాల్గొన్నారు.

రేపు బొంతుపేటలో వన భోజనం

లావేరు : మండలంలోని బొంతుపేటలో 21న బొంతు రామసత్యం తోటలో కార్తీక వన భోజన కార్యక్రమం జరగనుందని, పరిసర గ్రామాల ప్రజలు వనభోజన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని గ్రామపెద్దలు, నిర్వహకులు తెలిపారు.